కరవు, వలసలకు కారణమైన పాలకుల విధానాలపై ఉద్యమించాలి

రాష్ట్రవ్యాప్తంగా 680 మండలాల్లో 400కు పైగా మండలాలలో కరువు పరిస్థితి ఏర్పడింది. అనేక ప్రాంతాల నుంచి ముఖ్యంగా రాయలసీమ జిల్లాల నుండి వ్యవసాయ కూలీలు, కౌలు రైతులు వలసలు పోవడం సాగుతోంది. కర్నూలు జిల్లాలో అనేక ప్రాంతాల్లో స్కూళ్లలోని విద్యార్థుల సంఖ్య తల్లిదండ్రుల వలసలతో గణనీయంగా తగ్గిపోయింది. ఉత్తర కోస్తాలో అనేక ప్రాంతాలలో వేసిన పంటలు ఎండిపోయాయి. అనకాపల్లి జిల్లాలో 24 మండలాలలో 18 మండలాలు కరువు పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. రాష్ట్రంలో ఈ ఖరీఫ్‌లో సాగయ్యే పంట విస్తీర్ణంలో 86 లక్షల ఎకరాలలో 60 లక్షల ఎకరాలలోనే పంటలు వేయడం జరిగినది. మిగిలిన పంటలు వేసిన ప్రాంతాలలో కూడా పైర్లు రాక ఎండిపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 31 నాటికి కేవలం 103 మండలాలు మాత్రమే కరువు ప్రాంతాలుగా ప్రకటించింది. ప్రభుత్వాలు ఆర్భాటంగా చేపట్టే విధానాలేవీ కరువు ప్రాంత ప్రజల్ని వలసలు పోకుండా ఆపలేదు. సాగునీరు, డ్రైనేజీ వ్యవస్థల, కాలువల అస్తవ్యస్థ నిర్వహణల ఫలితంగా ఆయకట్టు కింద భూములలో కాలువ చివర ప్రాంతాల పంటలు కూడా చేతికి రాని పరిస్థితి ఏర్పడింది.

వాస్తవానికి భూగర్భజలాలు, ఉపరితల వర్షాలు, వరదనీరు, నదీ జలాలను సమగ్రంగా, శాస్త్రీయంగా నిల్వచేసుకొని వినియోగించగలిగితే దేశంలో కరవు, వర్షాభావం వంటి పరిస్థితులను సమర్థంగా అధిగమించవచ్చు. అయితే, పాలకులు తమ స్వార్థసంకుచిత విధానాలతో ఒకవైపున రాష్ట్రాల ప్రజల మధ్య నదీజలాల వివాదాలను ప్రేరేపిస్తున్నారు. అంతేగాక కొన్ని ప్రాంతాలను ఉద్దేశ్యపూర్వకంగా నిరంతర కరవు పీడిత ప్రాంతాలుగా వుంచి, కారుచౌక కూలీల ఎగుమతి కేంద్రాలుగా మలచుకుంటూ, ప్రాంతాల మధ్య అసమానతలను ఎగదోస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నారు.

కనుక సామ్రాజ్యవాదులు సృష్టిస్తున్న కరవును, దాని వెనుకనున్న పాలకుల కుట్రలను అర్థంచేసుకొని కరవు నెదుర్కొనేందుకు తక్షణ సహాయ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేయటంతోపాటుగా శాశ్వత నివారణా చర్యల వైపుగా ప్రజలను చైతన్యయుతం చేయాలి.

రాష్ట్ర ప్రజానీకం, రైతాంగం ప్రభుత్వం నుండి ఈ క్రింది డిమాండ్‌లు సాధించుకునేందుకు కదలాలి.

– రాష్ట్రంలోని అన్ని కరువు ప్రభావిత మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి.

– కరువు ప్రాంతాలుగా ప్రకటించిన ప్రాంతాలలో ఫిమేన్ కోడ్‌ను సవరించి, ప్రస్తుత పంటల ఖర్చుల ప్రకారం నష్టపోయిన పంటలకు వాటి యొక్క వాస్తవ పెట్టుబడుల ఆధారంగా పంటల నష్టపరిహారాలను నిర్ణయించి, ప్రకటించాలి, వెంటనే అందచేయాలి.

– తదుపరి వ్యవసాయ పనులకు కావలసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సబ్సిడీ ధరలకు అందచేయాలి.

–పేద, కౌలు రైతాంగం ఆత్మహత్యల పాలుగాకుండా నష్టపరిహారాలు వారికే నేరుగా అందేలాగా చర్యలు తీసుకోవాలి. రైతాంగానికి భరోసా ఇచ్చేవిధంగా ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకోవాలి.

– రాబోయే రోజుల్లో పశువులకి, మనుషులకి ఏర్పడబోతున్న మంచినీటి కొరతలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇప్పటినుండే నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలి.

– గ్రామీణ ఉపాధి పథకాన్ని విస్తరించి 200 రోజులు పాటు వ్యవసాయ కూలీలందరికీ పని కల్పించాలి, కనీస వేతనాన్ని ప్రభుత్వ నివేదికల ఆధారంగా 600 రూపాయలుగా నిర్ణయించాలి. వలసలను అరికట్టాలి.

– కరువు ప్రాంతాల విద్యార్థులు వలసలు పోకుండా, విద్యా సంవత్సరాలు నష్టపోకుండా తగు చర్యలు చేపట్టాలి.

– ఆయకట్టు చివరి భూములకు నీరందేలా కాలవల పూడికలను సక్రమంగా తీయించి, డ్రైనేజీ వ్యవస్థలను మెరుగు పర్చాలి.

– కాంట్రాక్టర్‌ల కోసం కాకుండా రాష్ట్ర వ్యవసాయ అభివృద్ధి కోసం అన్ని పెండింగు ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయాలి.

24-11-2023 **ఎస్.ఝాన్సీ,**

అధ్యక్షులు, రైతు కూలీ సంఘం (అం.ప్ర)